# అమావాస్య ప్రయాణం

శ్రీ బి. వి. సూర్యం

ఆనాడు అమావాస్య ఎవ్వరూ ఏపనిచేయడానికి సాహసించలేదు. మా వీధిలో నలుగురైదుగురు ప్రయాణాలుకూడా మానుకున్నారు. వీధులో తిరిగే ప్రతివాడీ నోటంటా ఏదోవిధంగా అమావాస్య అని శాస్త్రోక్తం అయినమాట వినబడుతోంది. అవన్నీ నమ్మినవారికే.

నేను ఆరోజు విశాఖపట్టణం వెళ్లవలసివచ్చింది. అమావాస్య అని కొంచెం జంకేను. కాని, ప్రయాణం తప్పితే వీలులేదు. స్టేషనుకు వెళ్లేను. ప్లాటిఫారం అంతా జనంతో నిండిఉంది. అమావాస్య అయినా పౌర్ణమి అయినా రైలువాళ్లకి బస్సువాళ్లకి ప్రయాణీకులు తక్కువవుండరనుకున్నాను. పెట్టీ అదీ అక్కడ వుంచి అలా పచారు చేస్తున్నాను. అప్పటికింకా అరగంటవేళుంది. ఏమితోచక అలా ప్లాటిఫారం కొసకి వెళ్లేను. అక్కడ ఒక యువతి, నవనాగరికంగా తయారయి, ప్రక్కనున్న ఆడవాళ్లతో మాట్లాడుతోంది. చూపుకి రకం మనిషిలాగే ఉంది. ఆమె ఆ ప్రక్కనున్న స్త్రీతో "ఈవేళ అమావాస్యతో ప్రయాణం తప్పిందికాదండీ" అంటోంది. నే నదివిని నాలోనవ్వుకున్నాను. ఆ ప్రక్కనే నలుగురు పెంకి కుర్రాళ్లు నిలబడి మాట్లాడుతున్నారు. వాళ్లసంభాషణ వైఖరిచూస్తే, ఆ స్త్రీని అల్లరిచేదామని అనుకుంటూన్నట్లుంది. అందులో ఒకడు "ఒరే, ఇవాళ టికెట్ కలక్టర్ ఎవడురా" అన్నాడు. ఇంకొకడు "మనవాడే, దాసు, చెప్పివస్తానుండు" అని వెళ్లేడు. నేను కొంచెంసేపు నిలబడి, తరువాత నాకెందుకీగోల అనుకున్నాను. రైలుబండి వచ్చి నిలిచింది. అంతా గోలగోల. కూలిలకేకలు, పెట్టెలబరబరలు, పిల్లలరుగులు మొదలైనవాటితో హడావిడిగా ఉంది. బోడమ్మలు స్టేషనుమీద విమర్శనలు అప్పుడే 'పాస్' చేస్తున్నారు. నేనో ఇంటరుక్లాసుపెట్టెలో ఎక్కేను. కొంచెం సేపటికి ఇందాకకనబడిన స్త్రీ, ఆ నలుగురు పెంకివాళ్లు, టికెట్టుకలక్టరుకూడా అందులోనే ఎక్కారు. బండి కదిలింది.

కొంతదూరం బండివెళ్లింది. ఎవడో "ఫొటో, ఫొటో" అని కేకలేశాడు. అక్కడనుంచి అందరూ అదేకేకలు, నేనటుతిరిగేను. నా కాకేకలేమి బోధపడలేదు. ఏదో ఫొటోనుగురించికాబోలనుకున్నాను. వాళ్లవద్ద అలాంటిబొమ్మలేవీలేవు. ఏదో దృశ్యాన్ని ఫొటో తీశారుకాబోలనుకున్నాను. ఎన్నో ఆలోచనలు తట్టేయి. ఆఖరికి ఆ కూర్చున్న స్త్రీ తాలూకఫొటో తీశుంటారని నిశ్చయించి అక్కడికి వెళ్లి, ఆమె ప్రక్కగా నిలబడిచూస్తున్నాను. వాళ్లందరూ నన్ను చూసి ఆశ్చర్యపడ్డారు. ఆమె పాపం చాలా చిన్నబోయినముఖంతో కూర్చుంది. నా కెంతో జాలివేసింది ఆమెనుచూడగానే. వాళ్లందరూ నావాలకం చూసి నే నామె కేదో బంధువుడ ననుకున్నారు. టికెట్టుకలక్టరు మెల్లగా టికెట్లుపుచ్చుకోడానికి జారిపోయాడు. వాళ్లలో ఒకడు తెగించి "మీ కోఫొటో కావాలండీ" అన్నాడు ధైర్యంగా. నేను కొన్నట్లే వాళ్లు ఆమెఫొటో తీసారనుకొన్నాను. నేను కొంచెం కోపంగా "ఏమిటిదంతానూ" అన్నాను. ఇప్పుడు వాళ్లఅనుమానం బలంఅయింది, మరి బాగుండదని "తెలీకచేసినపని క్షమించండి" అన్నారువాళ్లు. నేను "తీస్తే తీసారుకాని నాకో కాపీ ఇవ్వండి, అల్లరెందుకు" అని నాసీట్ దగ్గరివచ్చేశాను. 'అలాగే' అని అందరూ నవ్వుకున్నారు. అందులో వకడు, "మంచి కాజా తిన్నాడు, మనలని తిన్పించేడు." అన్నాడు. నేను గాబారాపడ్డాను. టిక్కెట్టుకలక్టరుతో 'ఏమిటాగోల' అని అడిగేను. ఆతడు 'ఆమె'ను 'ఫొటో' అంట్ఏ, ఉడుక్కుంటోంది." అన్నాడు. ప్రక్క స్టేషనులో వాళ్లంతా దిగిపోయారు. నేను తెల్లమొగం వేశాను. ఇది అంతా అమవాస్యప్రయాణంనుంచే వచ్చిందనుకున్నాను. ఆమె, నేనూ వాళ్లు అందరూకూడా బోల్తాపడడం అయిందనుకొన్నాను. కాని రోజూ ప్రయాణంచేసే టికెట్టుకలక్టరుకి ఏమీకాలేదు. అప్పుడు నిశ్చయం చేసుకున్నాను అందులో ఏమీ లేదని. ఆనాడేదైనా నష్టంకలిగితే అమావాస్య అనుకుంటాం. మరోనాడైతే మన ఖర్మం అనుకుంటాం, అంతే.